
www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 31 ఆగస్టు 2023



భూస్వాములకు కొమ్ముకాస్తున్న దెందులూరు తహశీల్దార్

ఏలూరు టౌన్: పేద ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న దెందులూరు తహశీల్దార్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా బుధవారం దోసపాడులో పేదలకు చెందిన చేపల చెరువుల వద్ద ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, దోసపాడు భూ పోరాట కమిటీల ఆధ్వర్యంలో 'భూమి మాదే, భూమి పై హక్కు మాకే, భూమిలో ఉన్న పంట మాదే' అంటూ నిరసన కార్యక్రమం చేపట్టారు. పేదల భూములను ప్రభుత్వం కాపాడాలన్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యులు పి.ఆనందరావు మాట్లాడుతూ దోసపాడులో 144, 145 సెక్షన్ పెట్టి పేదలను, దళితులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఆక్రమ్ 165 ఎకరాలు, సీలింగ్ 250 ఎకరాలను పేదలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పట్టాదారుల పేర్లు, వారి వారసుల పేర్లు ఇచ్చినప్పటికీ ఇవ్వలేదని మరలా ఇవ్వాలని దెందులూరు తహశీల్దార్ మాట మార్చడం సిగ్గుచేటన్నారు. తహశీల్దార్ చట్టాలను అమలు చేయకుండా భూస్వాముల పక్షాన కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు జాన్‌రాజ్, నాగేంద్ర, పవన్, లాజర్ మణి, ఏసుమణి, లలిత, మాణిక్యం, శ్రీను, వెంకటరమణ పాల్గొన్నారు.

కార్పొరేషన్లు నిర్వీర్యం..!



బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ తరగతులకు పెనుదెబ్బ
బ్యాంకు రుణాలతో పొందే ఉపాధికి గండి
గత ప్రభుత్వాల హయాంలో లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకు
నేడు ఏఒక్క పథకమూ అమలు కాని దుస్థితి
పథకాల సొమ్ము కార్పొరేషన్ జాబితాలో నమోదు
వెనుకబడిన తరగతులకు కొరవడిన ఉపాధి భద్రత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఆర్థికంగా వెనుకబడిన పేదలకు ఉపాధి భద్రత కల్పించి వెన్నుదన్నుగా నిలిచిన బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీ కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయి. దీంతో వివిధ తరగతుల ప్రజలకు బ్యాంకు రుణాలతో ఉపాధి మార్గం ఎంచుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో ఆయా తరగతుల ప్రజల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వాల హయాంలో బిసి, ఎస్‌సి, మైనార్టీ కార్పొరేషన్లకు ప్రత్యేక స్థానం ఉండేది. 2014లో టిడిపి ప్రభుత్వం వచ్చాక కాపు కార్పొరేషన్‌ను సైతం ఏర్పాటు చేసింది. చదువుకుని ఉపాధి లేని నిరుద్యోగులకు కార్పొరేషన్లు అండగా నిలిచేవి. ప్రతియేటా లక్ష్యాలు నిర్దేశించుకుని బిసి, ఎస్‌సి, మైనార్టీలకు బ్యాంకు రుణాలు ఇప్పించి ఉపాధి మార్గం చూపేవి. కిరాణా కొట్లు, ఫొటో స్టూడియోలు వంటి ఎన్నో వ్యాపారాలు పెట్టుకోవడంతోపాటు, కార్లు వంటివాటితో ఉపాధి పొందేందుకు కార్పొరేషన్లు సహాయ పడేవి. ప్రతి యూనిట్‌కూ రూ.లక్ష నుంచి రూ.పది లక్షలు వరకూ ఇచ్చిన పరిస్థితి కొనసాగేది. గత టిడిపి ప్రభుత్వ హయాంలో కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇచ్చిన పరిస్థితి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్థికంగా వెనుకబడిన బిసి తరగతికి చెందిన కుటుంబాలకు బిసి కార్పొరేషన్ ద్వారా దాదాపు పది వేలకుపైగా యూనిట్లు మంజూరయ్యాయి. కాపు కార్పొరేషన్ ద్వారా 15 వేల యూనిట్లు వరకూ ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయి. ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా తొమ్మిది వేలకుపైగా యూనిట్లు ఇచ్చారు. నిరుద్యోగులు, చదువుకోనివారు సైతం కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు పొంది లబ్ధి పొందారు. తీసుకున్న రుణంలో సగం సబ్సిడీ కింద ప్రభుత్వం భరించేది. రూ.లక్ష రుణం ఇస్తే రూ.50 వేలు సబ్సిడీ వర్తించేది. తీసుకున్న రుణంలో సగం సొమ్ము సబ్సిడీ కింద పోవడంతో లబ్ధిదారులకు ఎంతగానో మేలు జరిగేది. బ్యాంకు రుణాలు పొందిన కుటుంబాలకు ఏదోక ఉపాధి మార్గం దొరికేది. ఉపాధికి సంబంధించిన యూనిట్ ఏర్పాటు చేస్తేనే కార్పొరేషన్ ద్వారా బ్యాంకు రుణాలు మంజూరయ్యేవి. దీంతో లబ్ధి పొందిన ప్రతి కుటుంబమూ ఏదోక యూనిట్‌ను తప్పకుండా ఏర్పాటు చేసేవి. యూనిట్ ఏర్పాటుతో వచ్చే ఆదాయంతో ప్రతినెలా బ్యాంకు వాయిదాలు చెల్లించుకునేవారు. ఎంతోమంది కార్లు పొంది వాటిద్వారా ఉపాధి పొందారు. కార్పొరేషన్ రుణాల కింద కార్లు పొంది ఇప్పటికీ ఉపాధి పొందుతున్న కుటుంబాలు చాలా ఉన్నాయి.

ఉత్సవ విగ్రహాలుగా కార్పొరేషన్లు

వైసిపి ప్రభుత్వం వచ్చాక బిసి, ఎస్‌సి, మైనార్టీ, కాపు కార్పొరేషన్లే కాకుండా, బిసి సామాజిక తరతగతుల్లో అనేక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఛైర్మన్లను, డైరెక్టర్లను నియమించింది. అయితే నిధులు మాత్రం ఇవ్వలేదు. దీంతో ఛైర్మన్లుగా నియమితులైన వారు ఏం చేస్తున్నారో కూడా ఏఒక్కరికీ తెలియని పరిస్థితి ఉంది. కార్పొరేషన్ల పరిధిలో ఎటువంటి కార్యక్రమాలూ జరగడం లేదు. గతంలో రుణాల కోసం వచ్చే జనంతో కళకళలాడే కార్పొరేషన్లు నేడు వెలవెలబోతున్నాయి. పాత రుణాలకు సంబంధించిన వసూళ్లకు ఉద్యోగులు పరిమితమైన పరిస్థితి ఉంది. రాష్ట్రంలో అన్ని తరగతులకు ఇచ్చే సంక్షేమ పథకాల సొమ్మును బిసి, ఎస్‌సి, కాపు, మైనార్టీలకు ఇచ్చిన సొమ్ముగా చూపిస్తున్నారే తప్ప, ఉపాధి కల్పించే బ్యాంకు రుణాల గురించి మాత్రం ప్రభుత్వం మాట్లాడటం లేదు. కార్పొరేషన్ రుణాలు మంజూరు లేకపోవడంతో ఎంతోమంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయి. కార్పొరేషన్ రుణాలను పునరుద్ధరించాలని ఆయా తరగతుల ప్రజలంతా ముక్తకంఠంతో కోరుతున్నారు.


జంగారెడ్డిగూడెం సభలో మాట్లాడుతున్న లోకేష్

చింతలపూడి నియోజకవర్గంలో కొనసాగిన లోకేష్ యువగళం
199వ రోజు బొర్రంపాలెం నుంచి జంగారెడ్డిగూడెం వరకూ యాత్ర
బహిరంగ సభలో చింతలపూడి, పోలవరం ఎంఎల్‌ఎలపై అవినీతి ఆరోపణలు
టిడిపిలో చేరిన పలువురు నేతలు

గ్రీన్‌ఫీల్డ్ రైతులకు చట్టప్రకారం న్యాయం


లోకేష్‌కు రాఖీ కడుతున్న మహిళలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, జంగారెడ్డిగూడెం

టిడిపి అధికారంలోకొచ్చాక గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులకు 2013 భూసేకరణ చట్టప్రకారం న్యాయం చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర 199వ రోజు బుధవారం పోలవరం నియోజకవర్గం టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంలో ప్రారంభమై వల్లంపట్ల, మల్లుకుంట, రావికంపాడు మీదుగా చింతలపూడి నియోజకవర్గం జంగారెడ్డిగూడెం మండలంలోని దేవులపల్లి, పుట్టగట్లగూడెం, గురవాయిగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం వరకూ సాగింది. జంగారెడ్డిగూడెం సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడారు.

యాత్రలో లోకేష్‌కు గజమాలలతో టిడిపి నాయకులు స్వాగతం పలికారు. జనంతో కరచాలనం చేస్తూ, పలకరిస్తూ లోకేష్ ముందుకు సాగారు. పుట్లగట్లగూడెం వద్ద జంగారెడ్డిగూడెం మండలం గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రజోపయోగార్థం భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. జాతీయ రహదారి విస్తరణకు 2013 భూసేకరణ చట్టాన్ని అనుసరించకపోవడం దురదృష్టకరమన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక గ్రీన్‌ఫీల్డ్ హైవే రైతులకు చట్టప్రకారం న్యాయం చేస్తామన్నారు. రైతుల పొలాలకు నీరందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు. లక్కవరం గ్రామానికి చెందిన మత్స్యకారులు లోకేష్‌ను కలిసి సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన మాట్లాడుతూ మత్స్యకారులకు ఉపయోగపడే చెరువులను సైతం జగన్ వైసిపి దొంగలకు కట్టబెడుతున్నాడన్నారు. చంద్రబాబు పాలనలో మత్స్యకారులకు చెరువులు ఇవ్వాలని జిఒ ఇస్తే జగన్ తమ పార్టీ నాయకులకు చెరువులు ఇవ్వాలని చూడటం దుర్మార్గమన్నారు. తాము జిఒ 217ను రద్దు చేస్తామన్నారు. న్యాయవాదులు తమ సమస్యలపై లోకేష్‌కు వినతిపత్రం ఇచ్చారు.

టిడిపిలో చేరిన పలువురు నేతలు

పలువురు నేతలు లోకేష్ సమక్షంలో టిడిపిలో చేరారు. ప్రముఖ వ్యాపారవేత్త గోపాల్‌యాదవ్, ఆయన సోదరుడు మంగపతి యాదవ్ టిడిపిలో చేరారు. లోకేష్ వారికి పసుపు కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. వైసిపి నేతలు పాకనాటి శ్రీనివాస్‌యాదవ్, పొన్నబోయిన సురేష్‌యాదవ్, చేకూర్తి మల్లాచారి, నీలపాల సూర్యచంద్ర, రాసూరి నాగరాజు, గోరుమచ్చు రవితేజ, శ్రీనివాస్ టిడిపిలో చేరారు.

తారాస్థాయికి చింతపూడి, పోలవరం ఎంఎల్‌ఎల అవినీతి

జంగారెడ్డిగూడెంలో జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ చింతలపూడి ఎంఎల్‌ఎ ఎలిజాపైనా, పోలవరం ఎంఎల్‌ఎ బాలరాజుపైనా తీవ్ర అవినీతి ఆరోపణలు గుప్పించారు. చింతలపూడి ఎంఎల్‌ఎ పేరు ఎలిజా కాదని, అవినీతి రాజా అన్నారు. పాస్ పుస్తకాల్లో లంచం, ఎర్రకాలువ రిజర్వాయర్‌లో మట్టి కొట్టేసి కోట్లు సంపాదన, షిఫ్ట్ ఆపరేటర్లు, అంగన్‌వాడీ, ఆయాల నియామకాల్లో లంచాలు, ఇసుక దోపిడీ, భూముల్లో దోపిడీ, కొత్త అధికారి వస్తే మూడు నెలల జీతం కప్పం, ఇలా అనేక విధాలుగా దోచుకుంటున్నారన్నారు. పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు కాదని, బాలనాగు అని అన్నారు. గోదావరిలో ఇసుకంతా దోచేస్తున్నారని, పోలవరం మట్టితో కోట్లు కొల్లగొడుతున్నారన్నారు. నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో అవినీతికి పాల్పడుతున్నారని, సస్పెండ్ అయిన ఐటిడిఎ పిఒ సూర్యనారాయణతో అవినీతి చేశారన్నారు. టి.నరసాపురం సొసైటీలో ఎంఎల్‌ఎ బినామీలు రూ.120 కోట్లు అవినీతి చేశారన్నారు. టిడిపి అధికారంలోకొచ్చాక ముక్కుపిండి వసూలు చేస్తామన్నారు. జగన్ టిడిపి కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని, ఎన్ని కేసులు ఎక్కువ ఉంటే అంత పెద్ద నామినేటెడ్ పదవి ఇస్తామన్నారు.

భూములైనా అప్పగించండి.. పరిహారమైనా ఇవ్వండి

ప్రజాశక్తి - ఏలూరు

పెదపాడు మండలం వట్లూరులో వెమ్ టెక్నాలజీ పరిశ్రమ పేరుతో రైతుల నుండి తీసుకున్న భూములకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని, లేని పక్షంలో తిరిగి వారి భూములు వారికి అప్పగించాలని సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయనొక ప్రకటన విడుదల చేశారు. 2016లో టిడిపి ప్రభుత్వ హయాంలో విమాన విడిభాగాల తయారీ పరిశ్రమను వట్లూరులో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. దీనికోసం పెదపాడు మండలం వట్లూరు పంచాయతీ పరిధిలో దాదాపు 340 ఎకరాలను వెమ్ టెక్నాలజీ సంస్థకు ఎపిఐఐసి ద్వారా కేటాయించినట్లు తెలిపారు. అప్పట్లో ప్రభుత్వం ఈ భూములు ప్రభుత్వ భూములని, రైతులకు ఎలాంటి నష్టపరిహారమూ ఇవ్వబోమని చెప్పి బలవంతంగా లాక్కునేందుకు ప్రయత్నించడంతో రైతులు పెద్దఎత్తున సాగించిన ఆందోళన ఫలితంగా ప్రభుత్వం దిగొచ్చి ఎకరాకు రూ.2.50 లక్షలు నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. 2022 ఏప్రిల్లో ప్రభుత్వం మారిన తర్వాత ఆ భూములను వెమ్ టెక్నాలజీ నుండి ఎపిఐఐసి స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధీనంలో ఉంచుకుందని తెలిపారు. దీంతో ఆ పరిశ్రమ వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఇప్పటి వరకూ ఆ భూములకు చెందిన రైతులకు నష్టపరిహారం ఇవ్వడం గానీ, తిరిగి భూములను అప్పగించడం గాని రాష్ట్ర ప్రభుత్వం చేయలేదని పేర్కొన్నారు. దీనితో రైతులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంత మంది రైతులు తమ ఆడపిల్లలకు వివాహాలు చేసి పసుపు కుంకుమ కింద ఈ భూములు ఇచ్చారని, వారంత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రైతుల నుండి భూములు తీసుకుని ఏడేళ్లు దాటిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు పరిహారమైనా ఇవ్వాలని, లేదా తిరిగి ఆ భూములనైనా అప్పగించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బాధిత రైతులకు అండగా నిలబడి పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.


భీమడోలులో ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్ 2.0 కార్డ్ విధానాన్ని నిరసిస్తూ రెండు రోజుల పాటు చేపట్టనున్న దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్ బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లాలోని ఆయా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద లేఖర్లు, సహాయకులు నిరసన తెలిపారు.

భీమడోలు: రిజిస్ట్రేషన్‌లకు కొత్తసాఫ్ట్‌వేర్ కార్డ్ ప్రైమ్ 2.0 విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకిస్తూ సబ్ రిజిస్టర్ కార్యాలయాల పరిధిలో పనిచేసే దస్తావేజుల లేఖర్లు, వారి అనుబంధ సిబ్బంది రెండు రోజులపాటు చేపట్టిన పెన్‌డౌన్ భీమడోలులో బుధవారం ప్రారంభమైంది. దీనిలో భాగంగా సబ్ రిజిస్టర్ కార్యాలయం బయట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దస్తావేజు లేఖర్ల యూనియన్ భీమడోలు శాఖ ప్రతినిధులు నండూరి శ్రీరామ్, మురళీ మాట్లాడుతూ ఈ విధానం వల్ల క్షేత్రస్థాయిలో పలు సమస్యలు తలెత్తుతాయన్నారు. ఆస్తులకు ఒరిజినల్ డాక్యుమెంట్లు లేకుండానే రిజిస్ట్రేషన్ చేయడం వల్ల వాటి భద్రతకు ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని విమర్శించారు. దీనిలో భాగంగా ఆధార్, ఫోన్ లింక్ అప్, ఒటిపి ఇతర విధానాలు స్మార్ట్ ఫోన్ ద్వారా నిర్వహించే పద్ధతులు అందరికీ తెలిసే అవకాశాలు లేనందున కక్షిదారులు ఇబ్బందులు పాలవుతారన్నారు. ఆస్తులు రిజిస్ట్రేషన్ సమయంలో దస్తావేజుల లేఖర్లు ఇరుపక్షాల వారి మధ్య వచ్చే సందేహాలు, తలెత్తే సమస్యలకు సామరస్య వాతావరణంలో పరిష్కారం చూపి ఇరుపక్షాల వారికి నష్టం లేని విధంగా రిజిస్ట్రేషన్లు జరిగినందుకు సహకరిస్తున్నారు. కార్డ్ ప్రైమ్ 2.0 విధానములో సదర సమస్యల పరిష్కారానికి తావులేని కారణంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయని వారు తెలిపారు. ఒరిజినల్ డాక్యుమెంట్‌తో సంబంధం లేకుండా డిజిటల్ డాక్యుమెంట్‌తో రిజిస్ట్రేషన్ చేయటం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు కొత్త సాఫ్ట్‌వేర్ వాడకాన్ని మానుకోవాలని వారు కోరారు.

పోలవరం : ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన ప్రైమ్2.0 కార్డు విధానాన్ని నిరసిస్తూ పోలవరం పరిధిలోని దస్తావేజు లేఖర్లు, సహాయకులు స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పెన్‌డౌన్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో సారిక శివ కుమార్, రాకుర్తి హరనాధరావు, పెంజర్ల రమేష్, పెరుమాళ్ల గోవిందరావు, నందమూరి మహేష్, కారింకి నాగేశ్వరావు పాల్గొన్నారు.

బిజెపి పాలనలో పేదలకు ఒరిగింది శూన్యం

గ్యాస్ ధర రూ.1200 పెంచి ఎనిమిదేళ్లకు రూ.200 తగ్గింపు సిగ్గుచేటు - సిపిఎం సమరభేరి నిరసనల్లో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలపై అధిక ధరల భారాన్ని మోపి, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి ప్రభుత్వం ఘోరంగా మోసగించిందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం చేపట్టిన సమరభేరి ఏలూరు నగరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చేపల తూము సెంటర్‌లో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో రవి మాట్లాడారు. 2014లో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిత్యావసర సరుకుల ధరలన్నీ ఆకాశాన్నంటుతున్నాయని విమర్శించారు. పెట్రోల్,


నిడమర్రు మండలం అడవికొలనులో..

డీజిల్ ధర రూ.120కు చేరిందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర రూ.1200కు పెరిగిందన్నారు. అయితే గ్యాస్ ధర రూ.200 తగ్గిస్తున్నట్లు ప్రకటించారని, ఇది వాతపెట్టి పూత పూసినట్టు ఉందన్నారు. రూ.400 ఉన్న సిలిండర్ ధర



ఏలూరులో..

రూ.1200కు పెంచి ఎనిమిదేళ్ల తర్వాత రూ.200 తగ్గించడం సిగ్గుచేటని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి మత విద్వేషాలు రేపుతోందని, దానికి తాజాగా మణిపూర్, హర్యానాలో జరిగిన అల్లర్లే ఉదాహరణ అని అన్నారు. మనరాష్ట్రానికి అన్యాయం చేసిన బిజెపికి వైసిపి, టిడిపి ఎంపీలు పార్లమెంట్‌లో మద్దతు పలుకడం సిగ్గుచేటని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కూడా ఇంటి పన్ను, నీటి, చెత్త పన్నులు, విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ సమరభేరి ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.సోమయ్య, పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, ఎస్.సత్యనారాయణ, ఎం.ఇస్సాకు, ఏసుబాబు, మీసాల సత్యం, జి.కోటేశ్వరరావు, జె.గోపి, గౌడ రవీంద్ర, సీతారాం, ప్రధాన్, షేక్ కరీముల్లా, షేక్ సైదాని పాల్గొన్నారు.

నిడమర్రు: మండలంలోని అడవికొలనులో సిపిఎం సమరభేరిలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రచురించిన కరపత్రాలు పంచుతూ సంతకాలు సేకరించారు. అనంతరం స్థానిక సచివాలయం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నారపల్లి రమణారావు, కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, కె.పద్మారావు, లావేటి సోంబాబు, నక్క వెంకటేశ్వరరావు, వెలగలేటి మోహన్ పాల్గొన్నారు.


డాక్టరేట్ అందుకుంటున్న సుబ్బారావు

సుబ్బారావుకు తెలుగు సాహిత్యంలో డాక్టరేట్

ముసునూరు: మండలంలోని సూరేపల్లికి చెందిన కంకట సుబ్బారావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌ను అందజేసింది. తెలుగు, ప్రాచ్యభాషా విభాగంలో డాక్టర్ గుమ్మా సాంబశివరావు పర్యవేక్షణలో 'కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ కథాసాహిత్యం - పరిశీలన' అనే అంశంపై పరిశోధన చేశారు. సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించి డాక్టరేట్ డిగ్రీని విజయవంతంగా పూర్తిచేశారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన 39-40వ వార్షికోత్సవంలో ఎఎన్‌యు ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేశారు. సుబ్బారావు తల్లిదండ్రులు కంకట చినవెంకయ్య, లక్ష్మీకాంతం సామాన్య వ్యవసాయ కూలీలు. అలాంటి కుటుంబంలో జన్మించి అంచలంచలుగా ఎదుగుచూ డాక్టరేట్ సాధించిన సుబ్బారావును కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని విఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సుబ్బారావు పనిచేస్తున్నారు.

పేదలకు అండగా ఫ్యామిలీ డాక్టర్ : డిఎంహెచ్ఒ

ఏలూరు: ప్రతీపేదవాడు వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ డి. ఆశ తెలిపారు. పేదలు ఆసుపత్రుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా గ్రామాలకే అన్ని వైద్య సేవలందించే గొప్ప కార్యక్రమం ఫ్యామిలీ డాక్టర్ ఉద్దేశమన్నారు. ఈ విధానంలో సాధారణ వైద్య సేవలతోపాటు తల్లులు, బాలింతలకు వైద్యసేవలందిస్తారని చెప్పారు. కేన్సర్ నుంచి టిబి వరకూ పేదలకు వైద్య సేవలందిస్తారన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ డి.జోషిరాయ్ మాట్లాడుతూ జిల్లాలో ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ఇప్పటి వరకూ 27 మండలాల్లోని 482 గ్రామ సచివాలయాల పరిధిలో 6,82,550 మందికి వైద్య సేవలందించామని తెలిపారు. వీటిలో 4,36,415 మంది సాధారణ ఓపిలో నమోదుకాగా 20,321 మంది యాంటినెంటల్, 12105 మంది పోస్టునెంటల్ తల్లులకు కూడా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారన్నారు.

15లోగా వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లు వినియోగంలోకి తేవాలి

జవాబుదారీతనంతో గిరిజనులకు సంక్షేమ పథకాలందించండి
అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు
ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, ఎంఎల్ఎ తెల్లం బాలరాజు

ప్రజాశక్తి - కెఆర్.పురం(బుట్టాయగూడెం)

గిరిజన గ్రామాల్లో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులను వచ్చేనెల 15వ తేదీలోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని, లేకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. ఐటిడిఎ సమావేశపు హాలులో బుధవారం జరిగిన ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో గిరిజన మండలాల్లో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సూర్యతేజతో కలిసి అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు మెరుగైన విద్య, వైద్య సేవలందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతిస్తుందన్నారు. ఐటిడిఎ పరిధిలో 37 వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లను 15వ తేదీలోగా పూర్తి చేయాల్సి ఉండగా, పనుల్లో పురోగతి లేకపోవడం, మనబడి నాడు-నేడు పనులు కూడా నత్తనడకన కొనసాగడంపై గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారులు తమ వైఖరిని మార్చుకుని గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో సస్పెన్షన్‌లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి అమలు చేస్తున్న పనులన్నింటినీ నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలన్నారు. ఐటిడిఎ పరిధిలో చేపట్టే పనులను ప్రాజెక్ట్ అధికారి దృష్టికి సంబంధిత అధికారులు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. పోలవరం నియోజకవర్గంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించి నిధుల మంజూరుకు ప్రతిపాదనలు వెంటనే సమర్పించాలన్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణ పనుల నాణ్యతా ప్రమాణాలను ఆ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు పరిశీలించాలన్నారు. గిరిజన గ్రామాల్లో మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు ప్రబలకుండా నిరంతరం మలాథియాన్ ఫాగింగ్ చేయించడం, పూర్తి పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మెరుగైన వైద్య సేవలందించే దిశగా వైద్య


గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎంఎల్ఎ

సిబ్బంది పనిచేయాలన్నారు. గర్భిణులకు, పిల్లలకు రక్తహీనత, తదితర ఆరోగ్య సమస్యలు లేకుండా అంగన్‌వాడీ, ఎఎన్ఎంలు చర్యలు తీసుకోవాలన్నారు. ఐటిడిఎ పరిధిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతం చేసేందుకు ప్రాజెక్ట్ అధికారి ప్రతినెల గిరిజన మండలాల అధికారులతో సమీక్షించాలన్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. అంతర్వేది గూడెం, తెల్లంవారిగూడెం, బర్రింకలపాడు, కోయ రాజమండ్రిలో ప్రభుత్వ పాఠశాలల మీదుగా వెళ్లిన 11కెవి విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని తొలగించాలని సభ్యులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా నిర్వాసితులకు అందించిన భూమికి భూమి పరిహారంలో వేరే ప్రాంతంలోని గిరిజనులు వచ్చి శాంతి భద్రతల సమస్య సృష్టిస్తున్నారని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఇళ్ల పథకంలో భూసేకరణకు సంబంధించి కోర్టుల్లోని పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు.

పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నాయని, వీటి అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి చేతిపంపులు ఏర్పాటు చేయాలన్నారు. పోగొండ రిజర్వాయర్ నుండి సాగునీరు అందించేందుకు ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించాలన్నారు. పెద్దవాగు ప్రాజెక్ట్ ద్వారా సాగు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముంపు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా డెంగీ, మలేరియా జ్వరాల వ్యాప్తి నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని సూచించారు. గిరిజన మండలాల్లో వరదల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. పోలవరం, కొయ్యలగూడెం, టి.నరసాపురం మండలాల్లో జగనన్న ఇళ్ల పథకంలో కొంతమంది అర్హులకు ఇంకా ఇళ్లు మంజూరు కాలేదని, వారికి కూడా కొత్తగా ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ శ్రీపూజ, జిల్లా అటవీ శాఖాధికారి అరవింద్ దామా, జిల్లా పరిషత్ సిఇఒ కె.రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రాజు, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.ఆశ, గిరిజన మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరింపూడిలో డిపిఒ పర్యటన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస విశ్వనాథ్ పరింపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది సకాలంలో విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. గ్రామంలో తిరిగి పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరా పరిశీలించారు. ఈ సందర్భంగా రేపల్లెవాడ అవాసంలో తాగునీరు ట్యాంకు లీకేజీని గుర్తించి సరిచేయాలని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణను ఆదేశించారు. గ్రామ స్వరాజ్ వెండర్ వివరాలు నమోదు చేయించి చెల్లింపులు జరపాలని కొయ్యలగూడెం పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. సర్పంచి ముప్పిడి విజయకుమారి డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి రక్షాబంధన్ సందర్భంగా రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఆయనతో పాటు విస్తరణ అధికారి జి.సతీష్ ఉన్నారు.

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ అన్నారు. నూజివీడు పురపాలక సంఘం సమావేశం త్రివేణిదుర్గ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి సరఫరాకు, వీధిలైట్ల నిర్వహణకు, పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, కొమ్ము వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

25 మందికి ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఇళ్ల స్థలాలు పొందేందుకు అర్హత కలిగినా వివిధ సాంకేతిక కారణాలతో స్థలాలు రానివారికి 90 రోజుల పథకం పున:పరిశీలన చేసి ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నట్లు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. తమకు అర్హత ఉన్నా ఇళ్ల స్థలాలు రాలేదని దరఖాస్తులు చేసుకున్నవారిలో 90 రోజులు పథకంలో అధికారులు లబ్ధిదారులను గుర్తించారు. ఈ క్రమంలో బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో గుర్తించిన 25 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ఎంఎల్‌ఎ వాసుబాబు అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ఇచ్చిన పట్టాలకు స్థానిక విఆర్‌ఒలు భూమి ఎక్కడ ఉందో చూపిస్తారని తెలిపారు. ఇళ్లు త్వరగా నిర్మించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.1.80 లక్షలు రుణం ఇస్తుందని చెప్పారు. తహశీల్దార్ ఎవి.రమణరావు, ఆర్‌ఐ సిరిగినీడి సత్యనారాయణ, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగారావు, పుప్పాల గోపి, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఆంజనేయులు, ఉంగుటూరు సర్పంచి బంగారు సింధు, ఆయా గ్రామాల వైసిపి నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలకు వంటసామగ్రి అందజేత

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండలంలోని రామన్నగూడెం పంచాయతీ దేవినేనివారిగూడెం ఎలిమెంటరీ పాఠశాలకు వంటసామగ్రి దాత పాకలపాటి సుబ్రహ్మణ్యం ఆర్థిక సాయంతో బుధవారం అందించారు. పాకలపాటి సోమయ్య జ్ఞాపకార్థం వంటసామగ్రి ప్రధానోపాధ్యాయులు గెడ్డం దేవానందంకు అందించారు. పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాకలపాటి సోమయ్య కుమారులు పిటి.భీమేశ్వరరావు, పి.సుబ్రహ్మణ్యం, పి.భాస్కరరావు, పి.శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.

బీమా పథకాలతో బాధిత కుటుంబాల్లో వెలుగులు

ప్రజాశక్తి - మండవల్లి

బీమా పథకాలు బాధిత కుటుంబాల్లో వెలుగులు నింపుతాయని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు స్పష్టం చేశారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో బుధవారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకాల్లో చేరిన 16 కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు. బీమాలో చేరి మృతి చెందిన వారి కుటుంబాలకు ఆరు నెలల కాలంలో రూ.34 లక్షలు బీమా ద్వారా అందించినట్లు చెప్పారు. ఇంకా రూ.ఎనిమిది లక్షలు మంజూరు కావాల్సి ఉందని తెలిపారు. మండవల్లి గ్రామంలో ఏడుగురు లబ్ధిదారులకు రూ.14 లక్షలు, భైరవపట్నంలో రూ.రెండు లక్షలు, అయ్యవారి రుద్రవరంలో మూడు కుటుంబాలకు రూ.ఆరు లక్షలు, తక్కెళ్లపాడులో రూ.రెండు లక్షలు, ఆనందపురంలో రెండు కుటుంబాలకు రూ.నాలుగు లక్షలు, గన్నవరంలో రెండు కుటుంబాలకు రూ.నాలుగు లక్షలు, కొర్లపాడు గ్రామంలో రూ.రెండు లక్షల బీమా పథకం ద్వారా వచ్చిన సొమ్మును బాధితులకు ఇప్పటికే అందించినట్లు తెలిపారు. ఆపద సమయంలో ఆర్థిక భద్రత కలిగించే ఈ సామాజిక భద్రత పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకొని పథకాల్లో చేరి లబ్ధి పొందాలని ఆయన కోరారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జాతీయ ఫెడరేషన్ సభ్యులు సుబ్బారావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని మున్సిపల్ వర్కర్స్ జాతీయ ఫెడరేషన్ సభ్యులు, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు నెక్కంటి సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా ప్రథమ మహాసభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నెక్కంటి సుబ్బారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రాణాలకు తెగించి చెత్తను సేకరించి, డ్రెయినేజీలో ఉన్న మురుగు తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడుతున్నారన్నారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టి పారిశుధ్య కార్మికులకు తీరని అన్యాయం చేస్తుందని విమర్శించారు. జగన్ గత ఎన్నికల సందర్భంగా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు గడిచినా క్రమబద్ధీకరణ ఊసే లేకుండా తీరని ద్రోహం చేశారని విమర్శించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిలారు మల్లేశ్వరరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ఏర్పడిన ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని, విధి నిర్వహణ సమయంలో మరణించిన కుటుంబాల వారసులకు కారుణ్య నియమకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు పిఎఫ్ ఖాతాలు ప్రారంభించి, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి నాయకులు కృష్ణమాచార్యులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కుంచె వసంతరావు, ఎఐటియుసి నాయకులు కన్నబాబు, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బైక్ ఢీకొని మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోడ్డు దాటుతున్న ఒక మహిళా కానిస్టేబులును బైక్ ఢీకొనడంతో ఆమె గాయాలపాలయ్యారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న దేవి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర విధులకు హాజరై మంగళవారం రాత్రి ఏలూరు అమీనాపేట చర్చివద్ద దిగారు. అక్కడ నుంచి రోడ్డు దాటుతుండగా దిచక్రవాహనదారుడు ఆమెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయాలపాలైన ఆమెను స్థానికులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు పాతబస్టాండ్‌లో గుర్తు తెలిని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సుమారు 50 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి పాతబస్టాండ్ ప్రయాణికుల షెల్టర్లో బుధవారం సాయంత్రం మృతి చెంది ఉన్నాడు. ఆర్‌టిసి కంట్రోలర్ వెంకటచంద్రమౌళి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టూటౌన్ సిఐ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పకడ్బందీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియ

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన ప్రక్రియ అత్యంత పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో ఓటర్ల జాబితావారీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన, ఎస్ఎస్ఆర్ 2024 అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్విభజన కార్యక్రమం పూర్తి చేయాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా పోలింగ్ కేంద్రాలకు సంబంధించి భవనాల మార్పుగానీ, పేరు మార్పుగానీ ఏమైనా ఉంటే ప్రతిపాదించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 1736 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాలు పునర్విభజన ప్రక్రియ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాల్సి ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల పునర్విభజన, పోలింగ్ కేంద్రాల భవనాల మార్పు, పేరు మార్పునకు సంబంధించి సెప్టెంబరు 29వ తేదీన రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటుచేసి సంబంధిత ప్రతిపాదనలు సెప్టెంబర్ 30 నాటికి ఎన్నికల కమిషన్‌కు పంపనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎస్ఎస్.మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు నెరుసు నెలరాజు(బిజెపి), ఎం.శ్రీరా భరత్‌రావు (బిఎస్‌పి), పాలి ప్రసాద్ (టిడిపి), దశరథకుమార్ (ఆమ్ ఆద్మి పార్టీ) పాల్గొన్నారు.

నేడు నేషనల్ యూత్ ఫెస్ట్ - 2023

ప్రజాశక్తి - ఏలూరు

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కలెక్టర్ పర్యవేక్షణలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో భాగమైన జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణా విభాగం నేషనల్ యూత్ ఫెస్ట్ -2023 కార్యక్రమం ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి కంట్రోల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ జి.రత్నకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండోర్ స్టేడియం, కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో 5 కె రెడ్ రన్ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ మారథాన్‌లో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఏలూరు, జంగారెడ్డి గూడెం, చింతలపూడి, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లు ప్రాంతాల్లో రెడ్ రిబ్బన్ క్లబ్స్ కలిగిన డిగ్రీ కళాశా లల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.పది వేలు, ద్వితీయ బహుమతి రూ.ఏడు వేలు, తృతీయ బహుమతి రూ.ఐదు వేలు నగదు పారితోషికం అందించ నున్నట్లు చెప్పారు.

దీంతో పాటు ఈ విజేతలను తదుపరి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. వీరితో పాటు మరో ఏడుగురికి కన్సొలేషన్ కింద ఒక్కొక్కరికి రూ.వె య్యి నగదు బహుమతి అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టరు ప్రసన్నవెంకటేష్ పాల్గొంటారన్నారు. వీరితో పాటు డిఎంహెచ్ఒ, డిఇఒ, సెట్‌వెల్ సిఇఒ, ఎన్‌వైకె కో-ఆర్డినేటర్, జిల్లా ఎన్‌సిసి కమాండింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్, డిఎస్‌డిఒ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. ఈ నేషనల్ యూత్ ఫెస్ట్ - 2023 కార్యక్రమంలో భాగంగా 5కె రెడ్ రన్ అనంతరం జిల్లాలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో హెచ్ఐవి, ఎయిడ్స్ ఎడ్యుకేషన్‌పై రీల్స్ డ్రామా కార్యక్రమాలు, హైస్కూ లు స్థాయిలో ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ కాంపిటీషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సివిల్స్ విజేత సాగర్‌బాబుకు సన్మానం



ఆర్‌టిసి బస్సును అడ్డగించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ప్రాంతానికి చెందిన సాగం బాబు జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ పరీక్షల్లో విజయం సాధించి తమిళనాడు రాష్ట్రం పాండిచ్చేరి క్యాడర్‌లో ఐఆర్ ఎస్‌గా పోస్టింగ్ పొందడం హర్షణీ యమని స్థానిక విద్యావేత్త డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రియ దర్శిని కళాశా లలో సివిల్స్‌లో విజ యం సాధించిన యాళ్ల సాగర్‌బా బును శాలువ, పూల దండలతో బుధ వారం ఘనంగా సత్కరించారు. ఈ సంద ర్భంగా డాక్టర్ అలుగు ఆనంద్ శేఖర్ మాటా డుతూ దళిత గిరిజన సంఘాల జెఎసి ఆధ ర్యంలో యాళ్ల సాగర్‌బాబుకు భారీ సన్మాన సభ జరిగింద న్నారు. ఐఆర్ఎస్ విజేత సాగర్‌బాబు మాట్లాడుతూ సాధారణమైన గ్రామీణ ప్రాంత విద్య సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన తాను మూడో ప్రయత్నంలో ఐఆర్ఎస్ సాధించానని తెలిపారు. తన తల్లిదండ్రులు తన చిన్నతనంలోనే మరణిం చారన్నారు. తాను పట్టుదలతో కష్టపడి తన మూడో ప్రయత్నంలో ఐఆర్ ఎస్ సాధించినట్లు చెప్పారు. అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ ఫలాలు తన విజయానికి పునాదులు వేశాయన్నా రు. తన విజయం వెనుక తన సోదరుడు, బంధువులు, మిత్రులు, గురువుల పాత్ర ఎంతో ఉందని, వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. తాను కేంద్ర ప్రభుత్వంలో అధికారిని అయిన అనంతరం ఈ ప్రాంత అభివృద్ధికి అవకాశం ఉన్న మేరకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానుకొండ కిషోర్, నాటకశాల వెంకటరాజు, ప్రముఖ న్యాయవాది రాంబాబు, కోడేటి సత్యనారాయణ, సత్యానందం, రమేష్, సత్యనారాయణ దీపక్ పాల్గొన్నారు.

పిల్లలందరూ చదువుకోవాలి

మండవల్లి :విద్యకు దూరమైన విద్యార్థులు పాఠశాలల్లో, కళాశాలల్లో చేరి విద్యను అభ్యసించడానికి మిషన్ గ్రాస్ ఎన్రోల్‌మెంట్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జి.సుధాకర్ తెలిపారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాల మేరకు విద్యకు దూరమైన విద్యార్థులను గుర్తించే కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ జి.సుధాకర్ మాట్లాడుతూ పాఠశాల, కళాశాల ఈడు పిల్లలంతా పాఠశాలలో, కళాశాలలో ఉండి విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం అయ్యవారి రుద్రవరం గ్రామంలో పర్యటించి విద్యకు దూరమైన విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థులను తిరిగి పాఠశాలల్లో, కళాశాలలో చేర్పించి విద్యాభివృద్ధి సాధించేలా సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రమేష్, ప్రభయ్య, శివకుమారి, మైనర్ బాబు, కిరణ్‌కుమార్, బాబా సుబ్రహ్మణ్యం, దివాకర్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సు నడపాలని విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - ముసునూరు



ఆర్‌టిసి బస్సును అడ్డగించి ఆందోళన చేస్తున్న విద్యార్థులు

తమ గ్రామాల మీదుగా ఆర్‌టిసి బస్సు సర్వీస్ నడపాలని ముసునూరు మండలంలోని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చింతలవల్లిలో ఆర్‌టిసి బస్సును అడ్డగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ మండలంలోని చింతలవల్లి గ్రామం మీదుగా లోపూడి వెళ్లే ఆర్‌టిసి బస్సు మళ్లీ తిరిగి వచ్చేటప్పుడు కూడా లోపూడి, బస్వావరప్పాడు, చెక్కపల్లి, గోగులంపాడు, చింతలవల్లి మీదుగా నూజివీడు రావాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేశారు. దీంతో నూజివీడు డిపో మేనేజర్ వచ్చి విద్యార్థులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. నూజివీడు నుంచి చింతలపూడి వెళ్లడానికి లోపూడి గ్రామం వైపు యర్రవారిగూడెం మీదుగా 42 కిలోమీటర్లు మాత్రమేనని, అదే విస్సన్నపేట, చాట్రాయి గ్రామాల మీదగా వెళ్లాలంటే 65 కిలోమీటర్లు పైగా ఉంటుందని, ఆ రూటులో కూడా ఆర్‌టిసి బస్సు నడపాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఖాతాలో రూ.69 వేలు మాయం

లబోదిబోమంటున్న బాధితుడు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అడితిలో కట్టె పుల్లలను కొనుగోలు చేసిన వ్యక్తి ఒక రూపాయి ఫోన్‌పే చేయించుకుని బ్యాంక్ ఖాతా నుంచి రూ.69 వేలు మాయం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ముదినేపల్లిలో ఈ నెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం ఈ సంఘటను చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ముదినేపల్లికి చెందిన కోడె వెంకటస్వామి అలియాస్ చంటి స్థానిక బంటుమిల్లి రోడ్డులో శ్రీసాయిహర్షిత ట్రేడర్స్ (అడితి వ్యాపారం) నిర్వహిస్తుంటాడు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం ఒక వ్యక్తి బైక్‌పై వచ్చి "మాది కైకలూరు, నాపేరు తోట రామస్వామి. ముదినేపల్లిలో మాకు బంధువులు ఉన్నారు. మా ఊర్లో గంగానమ్మ సంబరం జరుగుతుంది" అని చెప్పి రూ.1,500 కట్టె పుల్లలను కొనుగోలు చేశాడు. తన యజమానికి ఫోన్‌పే ద్వారా ఒక రూపాయి వేస్తే పుల్లలకు సంబంధించిన రూ.1500 పంపిస్తారని చెప్పాడు. దీంతో వెంకటస్వామి అతను చెప్పిన నెంబర్‌కు రూపాయి పంపించాడు. అయితే అటువైపు నుంచి ఎంతసేపైనా నగదు రాకపోవడంతో తన యజమాని ఫోన్‌పే పని చేయడంలేదని పుల్లలను కొనుగోలు చేసిన వ్యక్తే సొమ్ము చెల్లించాడు. 'నేను వెళ్లి ఆటో పంపిస్తాను, ఆటోలో పుల్లలను వేసి పంపండి' అని చెప్పి అక్కడ నుంచి జారుకున్నాడు. సోమవారం తమ భర్త ఖాతాలో నగదు తగ్గినట్లు గుర్తించిన చంటి భార్య రూ.69 వేలు ఎవరికి పంపించారని భర్తను ప్రశ్నించింది. దీంతో కంగుతిన్నా చంటి స్థానిక ఎస్‌బిఐ అధికారులను సంప్రదించాడు. ముదినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆగంతకుడు కైకలూరుకు చెందిన వ్యక్తి తోట రామస్వామి పేరున బిల్లు రాయించాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఆర్ఆర్ బోయ్స్ హైస్కూల్‌కు ఎక్సలెన్స్ అవార్డు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు ఎస్ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ విద్యార్థులకు రెండోసారి జిల్లాస్థాయి స్పోర్ట్స్‌లో ఎక్సలెన్స్ అవార్డు రావడంపై ప్రధానోపాధ్యాయురాలు భాగవతుల హేమలత హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె బుధవారం పాఠశాలలో మాట్లాడుతూ వ్యాయామ ఉపాధ్యాయులు అందించిన శిక్షణ, విద్యార్థుల అవిశ్రాంత కృషికి ఫలితంగా అవార్డు లభించిందన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆమె అభినందించారు.

నవరత్నాల అమలుతో విప్లవాత్మక మార్పు

ఎంఎల్‌ఎ ఆళ్ల నాని

ప్రజాశక్తి - ఏలూరు

నవరత్నాల అమలుతో బడుగు బలహీన వర్గాల జీవితాల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని మాజీ ఉపముఖ్యమంత్రి, వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆళ్ల నాని అన్నారు. స్థానిక 28వ డివిజన్, బీడీ కాలనీలో 109వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ఆళ్ల నాని మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అన్ని రంగాల్లోనూ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసి, వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచామన్నారు. బిసి ఉప కులాలన్నిటికీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి వారి సమగ్ర అభివృద్ధికి విస్తృత కార్యాచరణ చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి ఉండి పథకాలు అందని వారి సమస్యలను పరిష్కరించి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానికులు ప్రస్తావించిన పలు సమస్యల పరిష్కారానికి సత్వర కార్యాచరణ చేపట్టాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళా కార్పొరేటర్లు, నేతలు ఆళ్ల నానికి రాఖీ కట్టారు. ఈ కార్యక్రమంలో తంగెళ్లమూడి సురేష్, కొలికిపాముల తిరుపతిరావు, లచ్చిరెడ్డి గోవిందరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రకు విశేష స్పందన : గన్ని

ప్రజాశక్తి - టి.నరసాపురం

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేస్తున్న యువగళం పాదయాత్రకు విశేష స్పందన లభిస్తుందని ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామ పంచాయతీలో వైసిపి నుంచి 12 కుటుంబాలు బుధవారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి గన్ని వీరాంజనేయులు పార్టీ కండువ కప్పి సాదారంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో ప్రజల్లో మార్పు వచ్చిందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. తిరుమలదేవిపేట పంచాయతీ నుంచి టిడిపిలోకి వంద కుటుంబాలు చేరాల్సి ఉండగా లోకేష్ యువగళం పాదయాత్ర క్యాంపు ఆఫీసులో చేర్చుకోవడం వీలు కాలేదని ఆయన తెలిపారు. మిగిలిన కుటుంబాల వారు స్థానిక నాయకుల సమక్షంలో చేర్చుకుంటారని ఆయన తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పురోగతి లేదని, రాష్ట్రానికి రాజధాని లేదని, పరిశ్రమలు లేవని ధ్వజమెత్తారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నాయుడు రామకృష్ణారావు గౌడ్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జయవరపు శ్రీరామమూర్తి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు నల్లూరి వెంకట చలపతిరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షులు పిన్నమనేని మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

భీమడోలులో ఆర్‌డిఒ పెంచల కిషోర్ పర్యటన

తొలగించిన ఓట్ల వివరాలపై ర్యాండమ్ పరిశీలన

ప్రజాశక్తి - భీమడోలు

ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా తొలగించిన ఓట్ల వివరాల ర్యాండమ్ పరిశీలన కోసం మండలంలో బుధవారం పర్యటించినట్లు ఏలూరు ఆర్‌డిఒ పెంచల కిషోర్ తెలిపారు. తొలుత ఆయన భీమడోలు తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం తొలగించిన ఓట్ల వివరాల ర్యాండమ్ పరిశీలనలో భాగంగా భీమడోలు మండలంలోని కొన్ని ఇళ్లను సందర్శించారు. తొలగించిన ఓట్ల వివరాలు గురించి గృహస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 9500 ఓట్లను ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా తొలగించారన్నారు. వీటిలో అధిక శాతం పేర్లు చనిపోయిన వారివే అన్నారు. వీరి వివరాలు అప్పట్లో కరోనా, ఇతర కారణాల వల్ల పూర్తిస్థాయి తొలగింపునకు అవకాశం లేకపోయిందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లను ఆధార్‌తో లింక్ చేయటం వల్ల పూర్తిస్థాయి వివరాలు వెలికి వచ్చాయన్నారు. ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ర్యాండమ్ చెకింగ్‌లో భాగంగా నియోజకవర్గంలోని వెయ్యి ఓట్ల తొలగింపుపై ర్యాండమ్ పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు తహశీల్దార్ ఎం.ఇందిరాగాంధీ, డిప్యూటీ తహశీల్దార్ షేక్ షంషుద్దీన్, ఆర్‌ఐ కిరణ్ కుమారి పాల్గొన్నారు.

పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి - కలిదిండి

స్థానిక కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో స్పోర్ట్స్ డే సందర్భంగా విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. సర్పంచి సానామీనా సరస్వతి చేతులమీదుగా బహుమతులు అందించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, మ్యాజిక్ షోను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారని కరెస్పాండెంట్ ఎస్‌వి.రామారావు చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మహిళలను గౌరవించడం భారతీయ సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమని, వారిని అందరూ గౌరవించాలని ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. బుధవారం రక్షాబంధన్ సందర్భంగా నూజివీడు నియోజకవర్గంలోని మహిళలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

బుట్టాయగూడెం :రాఖీ పౌర్ణమి సందర్భంగా పలువురు మహిళా ప్రజా ప్రతినిధులు పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు మాట్లాడుతూ సమాజంలో అన్నా చెల్లెలు, అక్కా తమ్ముల్ల మధ్య అనుబంధాన్ని చాటేది రక్షా బంధన్ అన్నారు. తనపై ప్రేమాభిమానాలు చూపతున్న మహిళా ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఒక అన్నగా, ఒక తమ్ముడిగా వారికి ఎప్పుడూ అండగా ఉంటానన్నారు. ఎంఎల్‌ఎ బాలరాజుకు రాఖీ కట్టినవారిలో కొయ్యలగూడెం జెడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీలక్ష్మి, వేలేరుపాడు జెడ్‌పిటిసి సభ్యులు బుజ్జా రామలక్ష్మి, వేలేరుపాడు ఎంపిపి దేవి, టి.నరసాపురం ఎంపిపి డి.లక్ష్మి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి స్టీల్ ప్లేట్లు, గ్లాసులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

చిన్నారులకు ప్రాథమిక విద్యను అందించే అంగన్‌వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు సమకూర్చడంలో డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు చేస్తున్న కృషి అభినందనీయమని స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యులు వజ్ర కిరణ్ అన్నారు. స్థానిక 28వ వార్డు రాజీవ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రానికి డాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో స్టీల్ గ్లాసులు, ప్లేట్లు బుధవారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వజ్ర కిరణ్ మాట్లాడుతూ సంఘ కార్యదర్శి పఠాన్ బాజీ భార్య గౌస్య పుట్టినరోజు సందర్భంగా సేవాభావంతో అంగన్‌వాడీ చిన్నారులకు ప్లేట్లు, గ్లాసులు అందించడం అభినందనీయమన్నారు. చిన్నపిల్లలు చేతులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేలా జాగ్రత్త వహించాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. సంఘ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అనంతరం సంఘ ఆధ్వర్యంలో డాక్టర్ వజ్ర కిరణ్‌ను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం వ్యవస్థాపకులు అమృతల రంగా, గౌరవ అధ్యక్షులు నెలపోలు ప్రభాకరరావు, అధ్యక్ష కార్యదర్శులు కె.లక్ష్మణరావు, పఠాన్ బాజీ, అంగన్‌వాడీ కేంద్రం సూపర్‌వైజర్ లక్ష్మి, టీచర్ జాన్సీరాణి చిన్నారులు పాల్గొన్నారు.